నింద మోపుతూ వున్నారు. ఇంక యిటువంటి ప్రబలమైన నిదర్శనాలతో కూడిన కారణములు వుంటే, ఇంక వీరి ఆగడాలకు అంతు వుండదు. ఇదికూడా ప్రభుత్వము గుర్తించాలి. గాలి దుమారముచేత ఎగిరే తుక్కుమాదిరిగా, ప్రజలు వారివారి చేష్టలను, ఆలోచనలను మార్చుకుంటూ వుంటారు. ఏనాడు ప్రభుత్వముమీద కొంతమంది ప్రజలకు అసంతృప్తి, ఏహ్యభావము కలుగుతుందో, ఆనాటినుంచి వారితో సంబంధం వున్న ప్రజానీకములో కూడా ఈ భావము, అంటువ్యాధివలె వ్యాపిస్తుంది. అటువంటి పరిస్థితులు యేర్పడిన తరువాత ప్రభుత్వముయొక్క చర్యలు యేవిధముగాను రాణింపవు. ఇది ప్రభుత్వము గుర్తించి మసలుకోవాలి.

రాబోయే ఎలక్షనులు సామాన్య మానవుని యొక్క జీవన్మరణ సమస్య తేలుస్తాయి. ఈ తరుణము తప్పింది అంటే సుమారు 5 సంవత్సరముల వరకూ, అనగా తిరిగి వచ్చే జనరలు యెలక్షనుల వరకు వీరికి తరుణోపాయములేదు. అందుచేత ప్రజలు, ప్రభుత్వమును నడుపుతూవున్న పార్టీ, ఈ తరుణమును వదలుకోకూడదు. వదలుకున్నయెడల తరువాత చింతించినా ఫలితము లేదు. ఇటువంటి పరిస్థితులే పశ్చిమ బెంగాల్‌లో శ్రీ శరత్‌చంద్రబోస్ నెగ్గినప్పుడు ఏర్పడినాయి. కాంగ్రెసు అప్పుడు చాలా విచారించి, వచ్చిన అపజయమును కప్పుకోడానికి అనేక విధాలుగా ప్రయత్నించింది. కాని లాభము లేకపోయింది. ఇది సరిగా గమనిస్తే కాంగ్రెసుకు ఒక గుణపాఠము. వారి కర్తవ్యము వారికి చాటింది. ఇప్పుడు వీరికి చెవియొగ్గి అనుకూలముగా నడిస్తే ప్రజలసంస్థ, 'కాంగ్రెసు సంస్థ' అని చెప్పుకునే గర్వం ప్రజలకు, ప్రభుత్వమునకు, సంస్థకు కూడా కలుగుతుంది. లేనియడల దానియొక్క ఫలితము వారే ఊహించుకోవాలి.

# ★ అనాది సందేశం ★

చింతా శ్రీరామచంద్రమూర్తి

“ముసలివాణ్ని అయిపోయాను తల్లీ! తనువులు శాశ్వతంగావు. బుద్బుదప్రాయాలు. ఏమో! ఎప్పుడో! అమ్మాయీ- వెళ్ళొస్తానమ్మా! జాగ్రత్తగా వుండు.”

“నాన్నా ప్రొద్దుగుంకకుండా రావూ?”

నావికుడి కళ్ళు చెమ్మగిల్లాయి. వయస్సు సంపాదించిపెట్టిన వణుకుతో భుజంమీద వలేసుకుని బయలుదేరాడు. సూర్యుడూ అప్పుడే నిద్రలోంచి లేస్తున్నాడు, పిల్లాడిలా తూరుపు కనుమ ఉయ్యాలలోంచి. జలాజలా ప్రవహించే సముద్రకెరటాలు తళుకుతళుకంటూ ఒయ్యారంగా జోలపాటలు పాడుతున్నాయి. చిన్న చిన్న పిట్టలు ఆకాశంలో రివ్వురివ్వున ఎగురుతున్నాయి.

నావికుడు పడవలో కూర్చున్నాడు. అతని మనస్సులో ఎన్నో భావాలు ప్రవహిస్తున్నాయి. నావ నీటిమీద తేలుతూ ముందుకు సాగిపోతోంది. ఎన్నో నదీనదాల పవిత్ర సలిలాల్ని తన హృదయంలో యిముడ్చుకునే మహాసముద్రమది. ఎన్ని మహాయుగాల ఆప్తబంధుత్వమో వాటిది, ఎవరికెరుక!

నావికుడు ముందుకు సాగిపోతున్నాడు. ఆ మహాసముద్రపు కెరటాలు స్వచ్ఛమైన ఆ తటాకాన్ని ముద్దుపెట్టుకుంటున్నాయి. చిన్న పిల్ల కెరటాలు కళక్, కళక్ మని సన్నగా అన్నాయి, పెద్దకెరటాల బిగుతు కౌగిళ్ళల్లోంచి.

నావికుడు అనుకున్నాడు, మా అమ్మాయి నన్నలా ముద్దుపెట్టుకోవడం లేదూ అని. నావికుని పడవ, తటాకాన్ని ముద్దుపెట్టుకునే ఆ కెరటాల్ని ముందుకు తోసివేసింది. ఆ రాపిడికి కెరటాలు కళ్ల వెంబడి నీళ్లు కార్చాయి. వెనకాలనించి భూమి సణిగింది. వయస్సులో వున్న యువకునిలా తీవ్రంగా వుంది భూమి అప్పుడు.

"ఈ కెరటాలు మా తల్లులు. నేను నీటిలోంచి జన్మించాను. తల్లికి పిల్లలంటే యిష్టం కాదూ" అని.

నావికుని హృదయం చివుక్కుమంది.

తండ్రి అతను. తల్లి కాదు. అసలు వాళ్ళమ్మాయికి తల్లి లేనే లేదు. తన కూతురు తల్లిలేని పిల్ల. ప్రేమ అన్నది తల్లికే గాని తండ్రికి వ్యక్తం కాదా? ఏమో!

అయితే తల్లీ పిల్లలమధ్య మధురతర సంబంధం ఎవరిది?

ఎవరిదీ ప్రేమ? ఎవరిదీ మైత్రి?

ఈ విషయం అనంతమైందని అనుకున్నాడు అతను. నీళ్ళకేసి దృష్టిని కేంద్రీకరిస్తున్నాడు. శక్తికొలదీ వల ఎగిరింది.

ముందునించి సముద్రంలోంచి కేకలు.

"రా నావికుడా, మమ్మల్ని పట్టుకో. గాలి అనుకూలంగా వుంది కదూ."

నావికుడు ఉలిక్కిపడ్డాడు. కళ్లతో ఆ ప్రదేశాన్నంతా కలియ వెతికాడు.

ఎవరివీ మాటలని పరకాయించి చూశాడు. అవి కనిపించాయి.

ఇంకెవరివి? వలనించి ఆటూయిటూ తప్పించుకుంటూ, గింజుకుంటూ, బాధపడుతూ, లొంగిపోతూవున్న చేపలవి ఆ పలుకులు.

వెనక భూప్రదేశాన్నుంచి మాటలు నేర్చిన మానవులు అరుస్తున్నారు.

"పట్టుకో నాన్నా, పట్టుకోకపోతే బ్రతకడం యెల్లాగ?"

ఆత్రుతతో మళ్ళా వల విసిరాడు నావికుడు.

"అబ్బా! చంపేవురా. మా ప్రాణాలు వుక్కిరిబిక్కిరి అవుతున్నాయి" చేపల వ్యథిత హృదయాలు పలికాయి.

"నాన్నా! చంపు! చంపకపోతే, నాకు పరికిణీలు కావద్దూ?" భూమిమీంచి పిల్ల కేక.

"అవి చాలు లే. ఇంకా యెందుకు చంపుతావు. నిన్న మొన్న కళ్ళు తెరిచిన నోరెరుగని పసిపాపలకి గాలి ఎల్లా పీల్చుకోవాలో కూడా చెప్పలేదు. మమ్మల్ని యీ వేళటికి వదివేయి" సముద్రంలో చేపల కేకలు.

"చాలవు నాన్నా, యింకా పట్టుకో" భూమిమీద పిల్ల.

ఆకాశంలో సూర్యుడు పెద్దవాడవుతున్నాడు. బలాన్ని అంతనీ చూపిస్తూ మబ్బుల్ని ఓడిస్తూ, సూటిగా నడిచెత్తికొచ్చాడు. వెయ్యి చేతుల్తోటీ యీ భూమినీ, యీ నీటినీ వుండగా చుట్టేటట్టు వున్నాడు, అప్పుడు.

తీసిన చేపల్ని బుట్టలో వేసుకుంటూ నావికుడు ముందుకు సాగిపోతున్నాడు. అప్పటికే గట్టుకి పడవకి చాలాదూరం అయింది. కాలం గిరున తిరిగింది.

ఎందుకో సూర్యుడు చల్లచల్లగా చప్పబడిపోయాడు. గాలి అప్రయత్నంగా మారింది. కెరటాలు వికటంగా అరిచాయి అతని చెవుల్లో.

"ఫరవాలేదు. ఇంకాపట్టు. తుఫాను రాదు."

చేపలు ఆహ్వానిస్తూ, నవ్వుతూ, ఎగురుతూ, ఆడుకుంటూ అన్నాయి.

"ఇవి సరిపోవేమో పాపం. ఇంకొన్ని పట్టుకో. భయంలేదు." భూమిమీద పిల్ల అంది:

"రా నాన్నా, ఇంక చాలు."

చేపలు రెట్టించి అన్నాయి.

"పట్టుకో నావికుడా పట్టుకో. నీ పిల్లకోసం వెళుదువుగాని లే. ఇంతలోకి ఏమీ అయిపోదు మీ పిల్ల."

భూమిమీద నావికుని కూతురు బావురుమంది, ఆ పెనుగాలికి జడిసి.

బుట్టలో చేపలు చనిపోతూ కళ్ళవెంట నీళ్లు కార్చాయి.

నీళ్ళలో యీదుతూన్న చేపలు అన్నాయి:

"పట్టుకో నావికుడా. గాలికి జడుస్తావేం?"

భూమిమీద పిల్ల ఏడుస్తూ గట్టిగా అరిచింది:

"గాలి ఎక్కువైంది. వచ్చేయ యీ పాటికి. లేకపోతే ప్రమాదం."

నావికునికి పడవ లొంగలేదు. తమని బాధిస్తున్నాడనేకోసం కొంత. కెరటాలు భళ్లున మనిషంత ఎత్తు లేస్తున్నాయి. బలంతో విప్లవ శంఖానాదం చేస్తున్నాయి. మేఘాల్లా గర్జించాయి. నల్లతాచుల్లా ఎగిరి బుసకొట్టాయి. నావికుణ్ని బంధించి కెరటాలు పడవలోంచి లోపటికి తీసుకుపోయి సముద్రుడికి వప్పగించాయి. అంతే, అంతటితో సరి. ఏడుస్తూ నావికుడు శవమై తేలిపోయాడు.

బాగా ఏడ్చి ఎరుపెక్కిన అమ్మాయి ముఖంలా అవుపించాడు, సూర్యుడు మేఘాల అవతల లోకాల మనుష్యునికి.

వయస్సుమళ్లిన పెద్ద చేపలు అన్నాయి:

“తగిన శాస్తి జరిగింది. సముద్ర గర్భంలోకి వెళ్లిపోతున్నాం. అక్కడికికూడా వస్తావా పట్టుకుందికి?”

కెరటాలు కొన వూపిరితో వున్న నావికుణ్ని తమ కఠిన హస్తాలతో ఛేదించాయి. చావు తెలివిలో, చెవులు ఓరగా పెట్టి, కూతురు పొలికేకల్ని వింటూన్న నావికుని చెవులో ఎవరిదో ఆర్తనాదం పడింది. దీనాతి దీనంగా వున్న అరుద్ధ కంఠస్వరం యింకెవ్వరిది?

“అయ్యో కూతురా” అనుకున్నాడు. కాని ఏం చెయ్యగలడు? అతనికి కాలం దగ్గర పడుతోంది. ప్రపంచ నాటక రంగమునించి ఓ పాత్రధారి అదృశ్యుడవబోతూవున్నాడు. అతను లేని బలాన్ని తెచ్చుకున్నాడు.

“అమ్మా” అన్నాడు. ఈ ప్రేమభరితమైన సజీవవాక్కు దిగ్దిగంతాలలో నాట్యం సలిపింది. అంతకంటె గట్టిగా మరొక్కసారి కేకవేశాడు, తల్లీ! అని.

“నాన్నా” అని భూవలయంమీంచి ప్రతిధ్వని వచ్చింది.

‘అమ్మా! ప్రేమించడం నేర్చుకో. దానంత మంచి దింకోటి లేదు. ఎక్కడ పుడుతారో! ఎక్కడ మరణిస్తారో, మానవులు!”

“రా నాన్నా యింక! సాయంత్రం పడుతోంది” ఆమెకి నావికుని గొంతుక వినపడలేదు.

“రావూ నాన్నా! మరి నేను ప్రేమించడం నేర్చుకున్నాను రావూ?”

కొన ఊపిరితో తన అంత్య వచనాలుగా భూమివైపు తిరిగి నావికుడు కేకవేశాడు.

“అమ్మా! నేర్చుకున్నావా ప్రేమించడం. నువ్వు ప్రేమిస్తావు. అదికాదు కావలిసింది. నిన్ను ప్రపంచం ప్రేమించాలి. తల్లి తండ్రులు లేని పిల్లవు.”

పడమటి కొండని సంధ్యారుణ కిరణాలు మసగ్గా పొడిచాయి. విశ్వామిత్రుడైన నావికుణ్ని పొట్టని పెట్టుకుందికే వచ్చిందేమో ఆ వర్షం. ఆకాశం వెలిసి పోయిన ఎర్ర చీరలా అయిపోయింది.

ఆ వీచిన గాలికి భూమిమీద కాకి రెప రెపా కొట్టుకుని ఎగరలేక చనిపోయింది.

పడిపోయిన చెట్టుతొర్రలోంచి తల్లిదండ్రుల కోసం దానిపిల్లలు ఎదురు చూస్తున్నాయి.

క్రితం కురిసిన వర్షానికి దూలం కింద పెద్ద కోడి గిజగిజా తన్నుకుని చనిపోయింది.

పిట్టగూట్లో దానిపిల్లలు తల్లికోసం బిగాలు మంటున్నాయి.

ఖండ ఖండాంతరాల్లోంచి, రకరకాల యిసక పర్రల్లోంచి, ద్వీపశ్రేణుల్లోంచి, లోయల లోంచి, అఖాతాలలోంచి మానవ సంస్కృతుల్ని వాసన చూసుకుంటూ, మహోత్కృష్టంగా కలకాలానికీ ప్రవహించే ఆ సముద్రం కెరటాలతో ఒడ్డును స్పృశిస్తూవుంటుంది. రంగులు లేని జాతులూ, దేవుడులేని మతాలూ అన్నీ కలిసి వైజ్ఞానిక విప్లవానికి ప్రాతిపదికలై, ఆ సముద్రపు అఖండత్వంతో కలిసి పొర్లిపారుతూ భూవలయం మీదికి వచ్చిపడతాయి. హోరున వీచే ఆ సముద్రపు గాలికి ప్రపంచపు పొలిమేరలపై తుంపర్లయి విసురుతూన్న నాగరికత చిహ్నంలో సంస్కృతీ కళా ఖండాలూ విశ్వమానవ పరిషత్తుకు సందేశాలై వినపిస్తూ వుంటాయి. అప్పుడే ఆ సముద్రపు టొడ్డున కొన్ని అక్షరాలు వ్రాయబడ్డాయి. ఎవరికోసమో కాదు. ప్రపంచం కోసం. తెల్లని వెన్నెలలోనూ, నల్లని చీకటిలోనూ, గ్రీష్మ ఋతువు వేసవి వేడి గాడ్పులలోనూ, వానలోనూ, హేమంత కాలంలోనూ, ఆ అక్షరాలు స్నిగ్ధంగా కనుపిస్తూ వుంటాయి. మాటలు నేర్చిన మానవు లందరికీ ఆ అక్షరాల భాష ఏదైనా భావం యిది: “దిక్కులేని వారిని ప్రేమించి ఆదరించు.”